క్లుప్తంగా

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ

జలదంకి: రాష్ట్రంలో పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి వారికి అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు కేశవరం సర్పంచ్ రావి ప్రసాద్‌నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మసముద్రం సచివాలయ పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు పద్మజ, కవిత, రోహిత్, అభి 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 15 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖర్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చుండూరు రాధాకృష్ణ, గద్దగుంట రవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిలో ఇకపై పూడికతీత పనులు ఉండవు



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ శ్రీనివాసరావు

ఉదయగిరి: ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది నుంచి కూలీలకు పూడిక తీత పనులు ఉండవని ఏపీఓ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని గండిపాళెంలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించి కూలీలకు సూచనలందించారు. ఆయన మాట్లాడుతూ ఇకపై రైతుల పొలాల్లో రైతు వారీ కుంటల తవ్వకాలు, పశువుల గడ్డి పెంపకం, పశువుల షెడ్‌ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, సరిహద్దు కందకాలు ఏర్పాటు పనులు ఉంటాయన్నారు. బయోమెట్రిక్ ద్వారా కూలీలు హాజరు వేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకుడు సిద్దు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి కృషి చేయండి



కమిషనర్‌ను అభినందిస్తున్న నేతలు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 19, 18, 15 వార్డులు ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ వార్డులని, వెనుకబడిన, కొండ ప్రాంతంలో ఉన్న ఈ వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాను కోరారు. ఆ వార్డులకు సంబంధించిన ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, అంబేడ్కర్ ఆశయ పోరాట సమితికి చెందిన తోడేటి మణి, తదితరులు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నూతన కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన్ను శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు భార్గవ్, ప్రమోద్, సీహెచ్ అనీల్, నోయెల్ శ్రీకాంత్, గద్దం దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వరం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వరికుంటపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరమని, ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి అన్నారు. ఆమె మంగళవారం మండలంలోని రామాపురంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. వైద్య నిపుణులు ఈ శిబిరంలో 430 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి కరిష్మా, సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ప్రతిష్ట ఆహ్వాన ప్రతికల ఆవిష్కరణ

వరికుంటపాడు: వరికుంటపాడులో నూతనంగా నిర్మించిన పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి నూతన ఆలయంలో ప్రతిష్ట మహోత్సవం ఆహ్వాన పత్రికలను ఆలయ వ్యవస్థాపకుడు పెండ్యాల సూర్యనారాయణ ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు ప్రాణ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జి.వెంకటరాజా, కేవీ కాంతారావు, కె.వెంకటమోహన్‌రావు, లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆదుకున్న ఆరోగ్యశ్రీ

అక్కడికక్కడే క్షణాల్లో రూ.25 లక్షలకు కార్డు అప్‌డేట్

- ఒంటరి వృద్ధురాలికి మెరుగైన వైద్యం
- మానవత్వాన్ని చాటుకున్న ప్రభుత్వం
- వలంటీర్ సేవాదృక్పథం

గత ప్రభుత్వానికి..
ప్రస్తుత ప్రభుత్వానికి తేడా ఇది.

పేదోళ్ల ఆరోగ్యానికి భరోసాగా ఉండే ఆరోగ్యశ్రీ నుంచి గత టీడీపీ ప్రభుత్వం ఎన్నో వ్యాధులను తొలగించి, ఉండే సేవలకు సైతం నిధులు మంజూరు చేయకుండా నిర్వీర్యం చేసింది. ఆరోగ్యశ్రీ కార్డు ఇచ్చేందుకు రేషన్‌కార్డు కొలమానం పెట్టి.. పేదలకు ఆరోగ్య భరోసాను దూరం చేసింది.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆరోగ్యశ్రీకి పునర్జీవం పోశారు. దాదాపుగా అన్ని వైద్య సేవలను ఆరోగ్యశ్రీ కిందకు తీసుకువచ్చారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా ఆరోగ్యశ్రీ కార్డును జారీ చేశారు. మానవత్వం ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై అత్యంత శ్రద్ధ తీసుకొంటున్న నేపథ్యంలో తాజాగా ఆరోగ్యశ్రీ కార్డు కింద రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు అందించే పరిమితిని రూ.25 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. అయితే ఓ ఒంటరి వృద్ధురాలికి ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితికి మించిన వ్యయంతో వైద్య సేవలు అందించాల్సి ఉండడంతో సచివాలయం వలంటీర్, ఉద్యోగులు అందరూ చకాచకా శ్రమించి క్షణాల్లో ఆమె సమస్యను పరిష్కరించారు.

కావలి : కావలి పట్టణంలోని మూర్తిశెట్టివారివీధికి చెందిన నల్లబోతుల తాయారమ్మ (65)ను కొడుకు, కోడలు ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంతో కొన్నేళ్లుగా చిన్న అద్దె గదిలో ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న



ఆస్పత్రి బెడ్‌పైనే ఆరోగ్యశ్రీకార్డు పరిమితి పెంచడానికి సాంకేతిక ప్రక్రియ పూర్తి చేస్తున్న వలంటీర్ అనూష



రూ.25 లక్షల పరిమితి ఆరోగ్యశ్రీ కార్డుతో తాయారమ్మ

వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3,000లతో ఆమె ఆర్థిక ఆసరాగా బతుకుతోంది. ఈ నెల 1వ తేదీ పింఛన్ అందుకుంది. మరుసటి రోజు ఆమె తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో 'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' కార్డు ఉండటంతో నెల్లూరులోని ఓ కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స కోసం చేరింది. అయితే ఆమెకు రూ.5 లక్షలకు మించి ఖర్చయ్యే వైద్యం చేయాల్సి ఉండడంతో 'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' కార్డు ఆదుకోవడానికి అవరోధంగా మారింది. ఆమె వద్ద ఉన్న ఆరోగ్యశ్రీ కార్డు అప్‌డేట్ కాలేదు. రూ.5 లక్షల పరిమితితో ఉన్న కార్డు ఉండడంతో వైద్యం చేయడానికి సదరు కార్పొరేట్ వైద్యశాల వైద్యులు నిరాకరించారు. దీంతో ఆమె పరిస్థితిని గమనించిన వైద్యశాలలోని 'ఆరోగ్యమిత్ర' మంగళవారం ఆమె ఆరోగ్యశ్రీ కార్డు వెనుక వైపు ముద్రించిన వలంటీర్ ఫోన్ నంబర్‌కు కాల్ చేసి వృద్ధురాలి పరిస్థితిని వివరించారు. వృద్ధురాలి ఆరోగ్యశ్రీ కార్డు ప్రస్తుతం రూ.5 లక్షల పరిమితికి మాత్రమే ఉందని, ఆ వృద్ధురాలికి అంతకు మించి ఖర్చు అవుతుందని తెల్పి చెప్పారు. దీంతో వలంటీర్ గణపవరపు అనూష మానవత్వంతో వ్యయ ప్రయాసాలు పడి హడావుడిగా ఆస్పత్రికి చేరుకుని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డును సంపూర్ణ వైద్య సేవలు అందేలా సాంకేతికంగా అన్ని ప్రక్రియలను పూర్తి చేసింది. ఇందుకు సచివాలయం ఉద్యోగులు ఆమెకు తోడ్పాటును అందించారు. చకాచకా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసి, విజయవాడలోని ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఉన్నతాధికారులతో కూడా మాట్లాడించి, ఆ వృద్ధురాలి కార్డును రూ.5 లక్షల పరిమితి నుంచి రూ.25 లక్షల పరిమితికి పెంచడంతో ఆమెకు వైద్య సేవలు అందించేందుకు మార్గం సుగమం అయింది. వలంటీర్ అక్కడికక్కడే కార్డును కూడా అందజేసింది. అదే ఆరోగ్యశ్రీ పరిమితి పెంచకపోయి ఉంటే.. ఆమె పరిస్థితి వేరుగా ఉండేదని స్థానికులతో పాటు వైద్యశాలలోని ఇతర రోగులు అభిప్రాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కాబట్టి అన్ని ఇంత వేగంగా జరిగాయని, గతంలో ఇలా ఎన్నడూ జరగలేదని స్థానికులు ప్రశంసలు కురిపించారు.

ప్రశాంతమైన కావలిపై దుష్ప్రచారం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



చిరు వ్యాపారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'కావలి నియోజకవర్గం ప్రశాంతతకు మారుపేరు. రౌడీయిజానికి ఇక్కడ తావు లేదు. అయితే ఎక్కడ నుంచో ఇక్కడికి వచ్చిన వాళ్లు కొందరు రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తూ, దాన్ని దుష్ప్రచారం చేస్తున్నారు' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ట్రంక్‌రోడ్డులో ఉన్న వ్యాపారులను ఎమ్మెల్యే మంగళవారం కలిశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ కావలిలో రౌడీమూకలు ఎవరూ లేరని, అలాంటి వారిని ఉపేక్షించమన్నారు. తాను 14 ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నానని, పెద్దలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు వంటి వారితో పాటు తాను కూడా కావలి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానన్నారు. ఎక్కడా తాము ప్రజలను భయభ్రాంతులకు గురి చేయలేదని చెప్పారు. కావలి నియోజకవర్గంలో రౌడీయిజంను ప్రోత్సహించిన నాయకులు గతంలో లేరని, తాను అలాంటి వాటికి దూరమని స్పష్టం చేశారు. రాజకీయంగా తమ స్వప్రయోజనాల కోసం కొందరు రౌడీమూలకు ఉసిగొల్పుతూ, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ తమపై అభాండాలు వేస్తున్నారని ఎమ్మెల్యే మండి పడ్డారు. కావలి నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధి పనులు చెప్పి, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. దుష్ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారని, గొడలు సృష్టించి, రౌడీమూకలు చెలరేగితే పీచమణిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

డాక్టర్ బీఎస్సార్ సేవలు మరువలేం



డాక్టర్ బీఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు

ఆత్మకూరు: ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే ప్రముఖ వైద్యుడు దివంగత బొమ్మిరెడ్డి సుందర రామిరెడ్డి డాక్టరుగా, ఎమ్మెల్యేగా అందించిన సేవలు మరువలేమని పలువురు వక్తలు అన్నారు. బీఎస్సార్ నాలుగో వర్ధంతిని పట్టణంలోని జేఆర్‌పేటలోని ప్రధాన సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహం వద్ద మంగళవారం కుటుంబ సభ్యులు నిర్వహించారు. బీఎస్సార్ కుమారుడు జెడ్పీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, అమెరికాలో స్థిరపడిన బీఎస్సార్ సోదరుడు, ప్రఖ్యాత కార్డియాలజిస్ట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బీఎస్సార్ పేదల పాలిట పెన్నిధిగా, తన ఆస్పత్రి ద్వారా ఎందరో పేదలకు ఉచిత వైద్య సేవలు అందించారని కొనియాడారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా, అజాతశత్రువుగా విశేష సేవలు అందించారన్నారు. తొలుత బీఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సమీపంలోని బీఎస్సార్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి అన్ని పార్టీల నాయకులు, అభిమానులు, కుటుంబ సభ్యులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు డాక్టర్ శ్రావణ్‌కుమార్, సర్దార్, కౌన్సిలర్ కౌసల్యమ్మ, బీఎస్సార్ కుటుంబ సభ్యులు అరవిందమ్మ, డాక్టర్ షకీల, మైథిలి, శశికళ, దొరసానమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, నందవరం ప్రసాద్, కలాం, సాధిక్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని విశ్వబ్రాహ్మణవీధిలో నివశిస్తున్న కొత్తపల్లి సుబ్బయ్య, నీరజ దంపతుల కుమార్తె కీర్తి ఇటీవల చర్మ వ్యాధికి గురై తీవ్ర ఆరోగ్య సమస్యలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం తమిళనాడులోని వేలూరులో చికిత్స చేయిస్తున్నారు. రెండేళ్ల క్రితం కీర్తి తండ్రి సుబ్బయ్య కరోనాతో మృతి చెందారు. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో పాపకు వైద్యం చేయించలేని పరిస్థితి తెలుసుకున్న పట్టణానికి చెందిన దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ ప్రణీత్ మంగళవారం సాయంత్రం బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ, తదితరులు ఉన్నారు.

గ్రామ జలసంఘ ఖాతాలు ప్రారంభించాలి

ఉదయగిరి: మండలంలోని వైఎస్సార్ క్రాంతి పథం పనిచేసే వీఓఏలు జలజీవన్ మిషన్‌కు సంబంధించి జలసంఘ కమిటీలు ఏర్పాటు చేసి బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలని ఏపీఎం సయ్యద్ ఖాజారంతుల్లా సూచించారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో వీఓఏలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ పొదుపు సంఘాల్లోని 9 మంది మహిళలు, పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలిపి 11 మంది సభ్యులతో ఏర్పాటు చేయాలన్నారు. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల రికవరీపై దృష్టి సారించి నూరు శాతం లక్ష్యం సాధించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మర్రిపాడు: ముందు వెళ్తున్న లారీని బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని రాజుపాళెం సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు 108కు సమాచారమివ్వడంతో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలేరమ్మ తిరునాళ్ల



పోలేరమ్మకు సద్ది నైవేద్యాన్ని సమర్పిస్తున్న భక్తులు

అల్లూరు: స్థానిక ఆర్‌డీఆర్ కాలనీలో కొలువైన పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లను మంగళవారం వేడుకగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి సద్ది నైవేద్యాన్ని సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అర్ధరాత్రి తర్వాత అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోలేరమ్మ గ్రామోత్సవం



భక్తుల కోలాహలం మధ్య పోలేరమ్మ తల్లి గ్రామోత్సవం

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలో పోలేరమ్మ తల్లి గ్రామోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిని పరిమళపుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం గ్రామ పురవీధుల్లో తప్పెట్లు, తాళాలతో వైభవంగా సాగింది. భక్తులు అమ్మ వారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులుగా బండారు హరిరెడ్డి వ్యవహరించారు.

నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు

- ఆర్డీఓ కె మధులత



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ మధులత, ఎంవీఐ రాములు, తదితరులు

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే కేవలం నిర్లక్ష్యంతోనే జరుగుతున్నాయని నిర్ధారణ అయిందని, ఎవరికి వారు స్వీయ జాగ్రత్తలు పాటిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చునని ఆత్మకూరు ఆర్డీఓ కె మధులత అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల నేపథ్యంలో మంగళవారం ఆర్డీఓ 'గుడ్ సమారిటన్' పోస్టర్లను రవాణాశాఖ ఎంవీఐ రాములుతో కలిసి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు చూసి మనకెందుకులే అని పట్టించుకోకుండా వెళ్లడం తప్పని, మానవతా దృక్పథంతో అలాంటి సందర్భాల్లో చికిత్స అందించేందుకు హాస్పిటల్‌కు తరలించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. గోల్డెన్ అవర్ (ప్రమాదం జరిగిన మొదటి గంట)లోపు సరైన చికిత్స అందించగలిగితే ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్ఎంఓ ఉషా సుందరి పోస్టర్లను ప్రాంగణంలో అతికించారు. వారు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగి ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన వారికి వైద్యులు, సిబ్బంది శక్తి మేరకు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. అభిరామ్ ఆస్పత్రిలో గుడ్ సమారిటన్ పోస్టర్లను ఎండీ డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆవరణలో అంటించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు చర్యలు



తహసీల్దార్లు, రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్

ఉదయగిరి: ఇటీవల ప్రచురించిన నూతన ఓటరు జాబితాలో తప్పుల సవరణకు చర్యలు చేపడుతున్నామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, తహసీల్దార్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో వచ్చిన తప్పులు గుర్తించామని, వాటిని సవరణ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల నాటికి సరిచేసి సమగ్ర ఓటరు జాబితా వచ్చేలా చూస్తామని ఆర్‌ఓ తెలిపారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో నెహ్రూబాబు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఓబుల్‌రెడ్డి, బయ్యన్న, కాకు వెంకటయ్య, అలీఅహ్మద్, తిరుపతినాయుడు, బాలయ్య, రవీంద్ర, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంక్షేమం, అభివృద్ధిపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న కంది మల్లికార్జున రెడ్డి

ఆత్మకూరు: రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయానికి ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్రం అమలు చేస్తున్న అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆ పార్టీ నాయకులు అన్నారు. పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంది మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సార్వత్రిక ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు మాట్లా డుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఎవరైనా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కాకు విజయలక్ష్మి, నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, గాజుల వెంకయ్య, కాలం బుజ్జిరెడ్డి, బి కృష్ణయ్య, చింతలపల్లి భరత్ రెడ్డి, నరసింహ నాయుడు, కె సుధాకర్, చెంచులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయాలి



డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజితను సత్కరిస్తున్న వైద్యసిబ్బంది

కలిగిరి: ప్రభుత్వాస్పత్రుల్లో ఆధునిక ఎక్విప్‌మెంట్, వసతులు, అవసరమైన మందులు అందుబాటులోకి తెస్తున్న నేపథ్యంలో ఇకపై ఆస్పత్రి పరిధిలోని గర్భిణులకు స్థానిక ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా వైద్యులు, వైద్య సిబ్బంది చొరవ తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత సూచించారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సేవలు అందించి ప్రజల అభిమానాన్ని చూరగొనాలని కోరారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాన్పులను ప్రభుత్వ వైద్యశాల్లో జరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సర్వేలను సమగ్రంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ప్రతి కుటుంబ ఆరోగ్య వివరాలు ఆశా కార్యకర్తల వద్ద అందుబాటులో ఉండాలన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమసేవ అవార్డులు అందుకున్న వైద్యాధికారిణి గీతారెడ్డి, పీహెచ్‌ఎన్ సక్కుబాయమ్మలను ఘనంగా సత్కరించారు. ఆశా కార్యకర్తలకు కొత్త యూనిఫాంలను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మస్తాన్‌బాషా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9న వెన్నవాడలో ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడలో ప్రభుత్వం నిర్మించిన పలు భవనాలను ఈ నెల 9న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభిస్తారని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. వెన్నవాడలో మంగళవారం ఎంపీపీ పర్యటించి ప్రారంభోత్సవాలకు సిద్ధమైన భవనాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో వెన్నవాడ వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్నాథం ప్రసాద్, దిశించర్ల ప్రసాద్, రేవూరు విజయ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.